
# ఎగరేయి జెండా



— పోట్లూరి సుబ్రహ్మణ్యం

అదో చిన్న పట్టణం. తూర్పు వీధిలో పోస్టాఫీసు దాటిన తరువాత మూడో ఇల్లు చూస్తారు మీరు. అది జీర్ణావస్థలో నున్న పెంకుటిల్లు. ముందువైపు ప్రహరీ కూలిపోయి ఉంది. ఇంటిమీద పెంకులు కొన్ని అక్కడక్కడా లేచిపోయి ఉన్నాయి. అయినా ఆ ఇంట్లో అరడజను మంది కాపురముంటున్నారు. ఎండొచ్చినా, వానొచ్చినా అన్నిటికీ అతీతంగా ఏ భావాలూ ముఖం మీద కనిపించకుండా జీవిస్తున్నారు.

ప్రస్తుతం ఆ ఇంటి వరండాలో వాలు కుర్చీలో కూర్చొని ఆలోచిస్తున్నాడు ఓ అరవై ఏళ్లాయన. ఆయనే ఆ ఇంటి యజమాని వరంధామయ్య. రెండేళ్ల క్రితం ఎలిమెంటరీ స్కూలు హెడ్ మాస్టరుగా రిటైరయ్యాడు. ఆయనకు రిటైర్‌మెంటు బెనిఫిట్సు యాభైవేల దాకా వచ్చాయి. నెలకు నాలుగు వందలు పెన్షను వస్తోంది. అతను యాభై వేలు బాంకులో వేసి పెన్షనుతో రోజులు నెట్టుకు వస్తున్నాడు.

పిచ్చివాడిలాగున్నాడే. యాభై వేలు బాంకులో వేసుకొని ఊరుకోకపోతే ఇల్లు బాగు చేసుకోకూడదూ. పక్కనే నాలుగు గదులు కట్టి అద్దెకివ్వకూడదూ! పట్నంలో సొంత ఇల్లు, సొంత స్థలం ఉండి ఇంత ఉదాసీనంగా ఉండే వాళ్లెవరయినా ఉంటారా అని చాలా మంది నోళ్లు నొక్కుకోవచ్చు. కాని ఇక్కడే ఉంది అసలైన మెలిక.

వరంధామయ్యకు నలుగురు సంతానం. రమ, ఉమ, మల్లిక, కుమారుడు జయరాం. మొదటి ఇద్దరూ పెళ్లికి ఎదిగి ఉన్నారు. రమ బి.ఎ. వరకూ చదివి ఉద్యోగం దొరక్క మొగుడు కోసం ఎదురు చూస్తూ కాలక్షేపానికి ట్యూషన్లు చెబుతోంది.

ఇక రెండోది ఉమ. మొదటి సంవత్సరం బి.యస్సీ పూర్తి చేసి, రెండో సంవత్సరం బి.యస్సీ. ఫీజులు కట్టాల్సిన సమయానికి వరంధామయ్య రిటైరయి పోయాడు. తనవల్ల కాదని చేతులు ఎత్తేసాడు. దాంతో ఆమె చదువు మాని టైపు నేర్చుకొంటోంది.

ఇకపోతే మల్లిక జూనియర్ ఇంటర్ చదువుతోంది. కుమారుడు జయరాం ఒక ప్రభుత్వ సంస్థలో టెంపరరీ టైపిస్టుగా పని చేస్తున్నాడు.

వరంధామయ్య అటు పిల్లల చదువులకు గాని, ఇటు ఇంటి పనికి గాని తన దగ్గరున్న మొత్తాన్ని ఖర్చు పెట్టకుండా ఉండటానికి కారణం గుండెలమీద కుంపట్లులా తయారైన ఇద్దరు కుమార్తెలకు చెరో పాతిక వేలతో మొగుళ్లని తెచ్చి ముందుగా ఆ బాధ్యత నెరవేర్చుకోవాలని ఉంది అతనికి. గత రెండేళ్లుగా ఆ వరుళ్ల వేటలో కొంత అనుభవాన్ని సంపాదించుకొన్నాడు.

ఇప్పుడు వరంధామయ్య వయసున్న ఇంకో పెద్ద మనిషి గేటు లేని ప్రహరీ దాటుకొని ఆ ఇంటి ఆవరణలో ప్రవేశించాడు. యథాలాపంగా తలెత్తి వీధివైపు చూసిన వరంధామయ్య ఒకటికి రెండు సార్లు కళ్లు చికిలించుకొని చూసాడు.

తరువాత ఆనందంగా లేచి నిలబడి "అరే. శంకరయ్యా నిన్న రాలేదేం" అన్నాడు. అప్పటికే ఆ వ్యక్తి వరండా మెట్లెక్కి వరంధామయ్య కెదురుగా నిలబడ్డాడు.

"కూర్చో" అంటూ ఎదురు కుర్చీ చూపించాడు.

ఇంతలో ఆ సంభాషణ విన్న వరంధామయ్య ధర్మపత్ని జయమ్మ మంచినీళ్ల గ్లాసుతో లోపల నుంచి వచ్చింది.

"అన్నయ్యా. అంతా బాగున్నారా" అంటూ పరామర్శించి గ్లాసు అందించింది.

అంతా బాగానే ఉన్నారని తలాడించి మంచి నీళ్ళు తాగి బడలిక తీర్చుకొన్నాడు. రెండు కుటుంబాలూ ఒకే ఊళ్లో ఉన్నా వాళ్లింటికి పోయినపుడు వాళ్లు అలా అడగడం, వీళ్లింటికి వచ్చినప్పుడు వీళ్లు ఇలా అడగడం మామూలే.

## పురుషులకు ప్రత్యేకం

వరంధామయ్య సస్పెన్సు భరించలేక "ఇంతకీ ఏమయిందిరా కాయా! పండా!" అన్నాడు.

జయమ్మ ఖాళీ గ్లాసు ఒక చేతిలో .పట్టుకొని శంకరయ్య జవాబు కోసం నిలబడింది.

కాని శంకరయ్య మౌనంగా ఉండిపోయాడు.

దానర్థం అనుకొన్నపని 'కాయ'నే అందరికీ తెలుస్తోంది. కాని అదేదో శంకరయ్య నోటంట వింటే అదో ఇది. శంకరయ్య ఉన్నట్లుండి పండంటాడేమోనని వాళ్ల గుడ్డి నమ్మకం.

మొన్న శంకరయ్యకు తెలిసిన వాళ్లు పక్కూరు నుంచి వచ్చి రమను చూసుకొని వెళ్లారు. ఫలితం శంకరయ్య చేత చెప్పంపు తామన్నారు. అందుకే శంకరయ్య రాకకోసం అంత ఆతృతగా ఎదురు చూస్తున్నాడు వరంధామయ్య.

శంకరయ్య ఉన్నట్లుండి జేబులోంచి ఒక అడ్రసు తీసి "ఒరే ఇతను పెళ్లిళ్ల పేరయ్య. మనం ఇక ఎక్కడికీ కాళ్లకు బలపాలు కట్టుకొని తిరగక్కర్లేదు. ఈ వూరికి వెళ్లి ఇతన్ని కలుసుకొన్నామంటే అతను నీ ఇద్దరు కుమార్తెలకు స్థాయికి తగ్గ సంబంధాలు కుదురుస్తాడు" అంటూ వరంధామయ్యకు చూపించాడు.

"అంటే మొన్నటి సంబంధం..."

"ఎగిరిపోయినట్లే అనుకో. వాళ్లకు ముప్పైవేలు కట్నం, పది సవర్లు బంగారు కావాలట. ఒక పిల్లకే అంతిస్తే రెండో పిల్ల మాటేమిటిరా."

వరంధామయ్య నిస్పృహగా కుర్చీలో ఒరిగిపోతే, జయమ్మ చేతిలోని స్టీలు గ్లాసు అప్రయత్నంగా జారి కింద గచ్చుమీద పడి 'టంగ్...టంగ్...టంగ్' అని దొర్లుకొంటూ పోయి గోడకానుకొని ఆగింది.

"రేయ్ బాధపడకురా. ఎల్లుండే మనం అక్కడికి వెళ్దాం." వరంధామయ్య చేతిమీద చేయి వేస్తూ అనునయంగా అన్నాడు శంకరయ్య.

వరంధామయ్య కళ్లు తెరచి "ఒరే ఎన్నో సార్లు ఇటువంటి వార్తలు విన్న నాకు ఈ బాధ ఒక్క నిముషమే. నువ్వన్నట్లే ఎల్లుండి వెళ్దాం" అన్నాడు స్నేహితుడి చేతిని తన చేతిలోకి తీసుకొని.

ఇంతలో "మామయ్యా! కాఫీ" అంటూ ట్రేలో రెండు కాఫీ కప్పులు పెట్టుకొని వచ్చింది రమ.

కప్పు అందుకొంటూ "శీఘ్రమే కల్యాణ ప్రాప్తిరస్తు' అంటూ చేయెత్తి ఆమెను దీవించాడు.

"నాకేం అంత తొందరలేదులే' సిగ్గుతో గొణుక్కుంది రమ.

కాఫీ తాగి లేచి నిలబడ్డాడు శంకరయ్య "ఉమ ఏదీ ఒక సారి చూసి పోతాను" అన్నాడు.

లోపల ఇనిస్టిట్యూట్‌కి పోవడానికి కాగితాలు తీసుకొంటున్న ఉమ ఈ మాటలు విని వరండాలోకి వచ్చి "నమస్కారం మామయ్యా" అంది రెండు చేతులు ముడిచి.

ఆమెను కూడా 'శీఘ్రమే కల్యాణ ప్రాప్తిరస్తు' అంటూ దీవించాడు.

తన కెదురుగా ఉన్న ఇద్దరినీ "ఒక్క నెల ఆగండి" అంటూ చిరునవ్వు నవ్వి, కూతుర్ల సిగ్గుకు మురిసి పోతున్న జయమ్మకు, 'నీవన్నట్లు జరిగితే చాలు. నీకు జీవితాంతం కృతజ్ఞతగా ఉంటానురా' అని ఊపిరి బిగపట్టి చూస్తున్న వరంధా మయ్యకు వెళ్లొస్తానని చెప్పి బయలు దేరాడు శంకరయ్య.

•• •• •• ••

విజయవాడ స్టేషనులో రైలు దిగి కాళ్లీడ్చుకొంటూ దగ్గరలో ఉన్న బస్ స్టాండుకు వచ్చారు మిత్రులిద్దరూ. అక్కడ్నుంచి వాళ్లు వెళ్లాల్సిన ఊరికి ఒకే ఒక బస్సుందట. అది ఉదయం ఒకసారి వెళ్లి మళ్లీ సాయంత్రమే తిరిగి వస్తుందట.

వరంధామయ్యకు ఆ ఊరి పేరు గుర్తు రాలేదు. ఆయనకు తెలుసుకోవాలన్న ఆతృత కూడా లేదు. ఉపాధ్యాయుడి వెనుక నడిచే విద్యార్థిలా నోరెత్తకుండా అతని వెంట వస్తున్నాడు.

ఇంతలో 'డబ.డబ' మని శబ్దం చేసుకొంటూ పెయింటు రాలిపోయి, పేర్లు చెదిరిపోయిన బి.సి. కాలం నాటి బస్సొకటి వచ్చి ఆగింది.

అది ఆగీ ఆగగానే 'జెండాలూరు! జెండాలూరు' అంటూ గాడిద ఓండ్ర పెట్టినట్లు అరుస్తున్నాడు క్లీనరు. విసిరేసిన విత్తనాల్లా కిటికీల్లోంచి దూరి తమ సీట్లు రిజర్వు చేసుకొంటున్నారు.

"ఒరేయ్. పద పద ఇదే మన బస్సు" అంటూ శంకరయ్య పరుగెత్తుకు వెళ్లి కిటికీ లోంచి తన

భుజానున్న తుండు గుడ్డను పొడవుగా పడేట్లు విసరి రెండు సీట్లు రిజర్వు చేసాడు.

తరువాత అతి కష్టం మీద ఇద్దరూ బస్సులో ప్రవేశించారు. ఇప్పుడిప్పుడే బయలు దేరుతున్నట్లు నటించి చివరకు గంట తర్వాత బయలు దేరింది బస్సు.

కొద్దిదూరం మెయిను రోడ్డులో ప్రయాణించిన బస్సు తరువాత చీలి ఓ మట్టి రోడ్డున పడి దుమ్ము లేపుకొంటూ పోసాగింది. దారిలో ఎన్నో కొండలు, గుట్టలు దాటి పోతున్నాయి. తమాషా ఏమిటంటే విజయవాడలో బయలు దేరిన బస్సు ఎక్కడా ఆగలేదు. అలా అరవై కిలోమీటర్లు మట్టి రోడ్డు మీద ప్రయాణించింది.

"అదుగో జెండా" చుట్టూ కొండల మధ్య సగర్వంగా ఎగురుతున్న తెల్ల జెండాను చూస్తూ పెద్దగా అరిచాడు వరంధామయ్య. అతనెప్పుడూ అంత పెద్ద జెండాను చూడ్లేదు.

"అదే జెండాలూరు" అన్నాడు శంకరయ్య.

కొద్ది సేపటికి చుట్టూ అరుగు మధ్యలో పెద్ద వేప చెట్టుకు ఎత్తుగా కట్టి ఉన్న జెండా దగ్గర ఆగింది బస్సు. బిల బిల మంటూ బస్సు లోంచి దిగారు జనం.

వేపచెట్టు నీడలో అరుగుమీద దాదాపు పదిమంది పురోహితులు కూర్చొని ఉన్నారు. వాళ్లంతా ప్రయాణీకులను చుట్టుకొని 'నాతో రండి... నాతో రండి" అంటూ తిరుమలలో కొత్త భక్తుల్ని బోల్తా కొట్టించే నకిలీ పూజారుల్లా పిలుస్తున్నారు.

శంకరయ్య చేయి పట్టుకొని వాళ్లలోంచి బయట పడ్డాడు వరంధామయ్య. ఇద్దరూ వీధి వెంట నడుస్తున్నారు. ప్రతి ఇంటి మీదా ఒక్కో తెల్ల జెండా ఎగురుతోంది. కొన్ని ఇళ్లల్లో రెండు, మూడు, నాలుగు కూడా ఉన్నాయి. అందులో ఇళ్లమీద కట్టిన జెండాలు రకరకాల ఎత్తుల్లో, ఎత్తుకు తగ్గ సైజుల్లో ఉన్నాయి. అయిదడుగుల ఎత్తునుంచి అరవై అడుగుల ఎత్తు వరకు ఉన్నాయి. వాటి మీద ఏవేవో వ్రాసి ఉన్నాయి.

ఇంతవరకు సస్పెన్సు భరించిన వరంధామయ్య ఇక ఉండలేక పోయాడు. నడుస్తున్న వాడల్లా ఆగి, "ఒరే శంకరయ్యా అంతా మాయగా ఉంది. విజయవాడలో బస్సెక్కిన ప్రయాణీకులంతా యాత్రికుల్లా ఈ జెండాలూరు రావడమేమిటి, ఇక్కడ ఇళ్లమీద రకరకాల ఎత్తుల్లో రకరకాల సైజుల్లో జండాలుండడమేమిటి. మనం వచ్చింది అమ్మాయిలకు సంబంధాలు మాట్లాడటానికా లేక తీర్థయాత్రలకా. అయినా ఈ పుణ్యక్షేత్రం పేరు ఇప్పటి వరకూ వినలేదు గదరా" అన్నాడు.

"వరంధామయ్యా! ఓ పది నిముషాలూరుకో. అంతా నేకే అర్థమవుతుంది. వీలున్నంతవరకూ ఆ జెండాల మీద ఏముందో చదవడానికి ప్రయత్నించు" అంటూ తాత్కాలికంగా అతన్ని శాంతింపజేశాడు.

వరంధామయ్య మౌనంగా ఆ జెండాల మీద ఉన్నది చదువుతూ నడుస్తున్నాడు. బి.జి.-ఎ.ఇ. 75, బి.జి.-యం.డి.150 బి.జి.-జె.ఎ. 50, బి.జి. -స్వీ. 5, ఇలా ఉన్నాయి. సంఖ్య ఎక్కువ తక్కువలను బట్టి జెండాల ఎత్తులు కూడా మారుతున్నాయి. ఏమిటీ కోడ్. అన్నీ కంప్యూటర్ ఫిగర్స్‌లా ఉన్నాయే అనుకొన్నాడు.

ఏదో అడగ బోయేలోగా "ఇదే ఇల్లు" అన్నాడు శంకరయ్య. ఇద్దరూ వీధిగేటు తీసుకొని లోపలికి వెళ్లారు. లోపల వరండాలో పద్మాసనం వేసుకొని కూర్చొని ఉన్నాడు ఒక పండు ముదుసలి. అతని పక్కనే కొన్ని పుస్తకాలున్నాయి. అతని కెదురుగా ఓ నలుగురు కూర్చొని ఉన్నారు.

వీళ్లను చూడగానే పండు ముదుసలి చిరునవ్వు నవ్వి "రండి..రండి..ఎన్నాళ్లకు చూసాను శంకరయ్యా నిన్ను. లోపల కూర్చోండి. పది నిముషాల్లో వీళ్లను పంపించి వస్తాను" అన్నాడు.

ఇద్దరూ లోపలకు వెళ్లి కూర్చొన్నారు. ఒక ముసలామె రెండు గ్లాసులతో నీళ్లు తెచ్చింది. ఆమె అతని భార్య కాబోలు అనుకొన్నాడు వరంధామయ్య.

ఇంతలో శంకరయ్య "నే చెప్పానే పెళ్లిళ్ల సంబంధాలు చూసే రామనాథ శాస్త్రని. అతనే ఇతను. ఆయన దగ్గరున్న పుస్తకంలో చాలా అడ్రసులున్నాయి. మనకు కావలసిన సంబంధం తప్పక దొరుకుతుంది. బయట కూర్చున్న పెద్ద మనుషులు కూడా ఆ పనిమీద వచ్చిన వాళ్లే" అన్నాడు.

పది నిముషాల తరువాత రామనాథ శాస్త్రి బట్టతల తడుముకొంటూ పిలక నిమురుకొంటూ లోపలికొచ్చాడు. రాగానే ఇద్దరి కెదురుగా ఉన్న వాలు కుర్చీలో కూర్చొన్నాడు.

ఇద్దర్నీ కుశల ప్రశ్నలు వేసాడు. రామనాథ శాస్త్రికి, శంకరయ్యకు ఏదో దూరపు బంధుత్వముంది. తరువాత తాము వచ్చిన పని చెప్పాడు శంకరయ్య.

"అరె. అదెంతపని. ఇంతకీ మీరు సెలక్ట్ చేసుకొన్న జెండాల వివరాలు ఇవ్వండి" అన్నాడు పుస్తకం తెరుస్తూ.

"జెండా లేమిటి. వివరాలివ్వడమేమిటి. ముందే అర్థంగాక చస్తూంటే" సహనం చచ్చి కొద్దిగా విసుగ్గా అన్నాడు వరంధామయ్య.

"అయితే జెండాలూరు సంగతి మీకు తెలియదన్నమాట" ఈ సారి ఆశ్చర్యంగా నోరు తెరిచాడు రామనాథ శాస్త్రి.

వరంధామయ్య మౌనంగా ఉండి పోయాడు.

"అయితే చెబుతాను వినండి. ఇది ఒక పుణ్యక్షేత్రమూ కాదు. ఒక చారిత్రాత్మక ప్రదేశమూ కాదు. కాని అంతకంటే గొప్పది. ఎంతో విలువయినది. జి.యన్.టి. రోడ్డుకు అరవై కిలోమీటర్ల దూరంలో కొండల మాటున నిర్మించిన ఈ గ్రామం యొక్క అంతరార్థ మేమిటో బయటి ప్రపంచానికి తెలియదు. రహస్యంగా తెలుసుకొంటే తప్ప..." గాలి పీల్చుకొన్నాడు రామనాథ శాస్త్రి.

"...ప్రస్తుతం వరకట్నం ప్రభుత్వం నిషేధించింది. చట్ట ప్రకారం వరకట్నం తీసుకొన్నవాళ్లు శిక్షార్హులు. కనుక కట్నం తీసుకోకూడదు. ఆ పరిస్థితుల్లో ఒక 'మహా మేధావి' ఆలోచనలకు ప్రతిరూపమిది. ఆయనకు ఆరుగురు కుమారులు. అంతా పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. కట్నం తీసుకోవాలంటే భయంగా ఉంది. కారణం ఆయన లోకం దృష్టిలో గొప్ప సంఘ సంస్కర్త. ఇంత పెద్ద సంఘ సంస్కర్త అయి ఉండీ తన కుమారులకు కట్నం తీసుకొంటే ప్రజలు హర్షించరుగదా. తన సోషల్ ప్రిస్టేజి కాపాడుకోవాలి. దాంతో పాటు భారీ ఎత్తున కట్న కానుకలు తీసుకోవాలి. అందుకే ఆయన తనలాంటి కొందరితో కలసి ఆలోచించాడు. అందరూ కలసి ఇక్కడ యాభై చిన్న చిన్న ఇళ్లు కట్టించి ఒక్కో ఇంటి మీద ఒక్కో జెండా ఎగరేయించి దానిమీద వరుడి చదువు, ఉద్యోగం, రావలసిన కట్నం ముద్రించారు. తమ అడ్రసులు మరుగున పెట్టి, కేరాఫ్ అడ్రసులు బాక్సు నెంబర్లు పత్రికకు పెట్టి 'వధువు కావలెను' అని ప్రకటనలు వేయించారు. ప్రకటనలలో కట్నం ప్రసక్తి లేదు. గతంలో జెండాలూరు పక్కనే కోయవాళ్ల పల్లె ఒకటుండేది. మొదటగా నన్నూ నాకు తోడుగా మరో ఇద్దరు పురోహితుల్ని ఇక్కడ ఉంచారు. అంతే. పత్రికలో ప్రకటనను చూసి పత్రికాఫీసుకు పోయిన ఆడపిల్లల తల్లిదండ్రుల దగ్గర ఈ రహస్యం ఎక్కడా పొక్కనివ్వమనే హామీ పత్రం తీసుకొని వాళ్లని ఇక్కడకు పంపేవారు. పత్రిక పెట్టుకొన్నది జెండాలూరు నిర్మించిన వారే కనుక అసలు రహస్యం ఇంకో విధంగా బయటికి తెలిసేది కాదు. ఇక్కడకు వచ్చిన అమ్మాయిల తల్లి దండ్రులతో మనీ డీలింగ్సు చేసి మారేజస్ సెటిల్ చేసే వాళ్లం మేము. క్రమేణా జెండాలు పెరిగిపోయాయి. పురోహితులూ ఎక్కువయిపోయారు. సంబంధాల కోసం ఇక్కడికి వచ్చేవాళ్లూ ఎక్కువయ్యారు..." గాలి పీల్చుకొన్నాడు.

"అయితే నేను కొన్ని జెండాలు చూసాను" అంటూ తను చూసిన జెండాల గురించి చెప్పాడు వరంధామయ్య.

"బి.జి. - ఎ.ఇ. 75 అంటే బ్రైడ్ గ్రూమ్ (వరుడు) అసిస్టెంటు ఇంజనీరు, కట్నం డెబ్బై అయిదు వేలు అని, బి.జి. - యండి. 150 అంటే వరుడు డాక్టరు. డిగ్రీ యం.డి. అని, అతని రేటు లక్షా యాభై వేలని అర్థం. బి.జి./2 - జె.ఎ. 50 అంటే వరుడు రెండవ పెళ్లివాడు, రేటు యాభై వేలని, బి.జి.-స్వీ. 5 అంటే వరుడు స్వీపరు ఉద్యోగం చేస్తున్నాడని, అతనికి కావలసిన కట్నం అయిదు వేలని అర్థం. ప్రతి జెండాకు సీరియల్ నంబరుంటుంది. అది ముఖ్యం. దాంతో పుస్తకంలోని వరుని అడ్రసు వెరిఫై చేయడం చాలా తేలిక."

జెండాల మీదున్న పదాల అర్థం తెలుసుకొన్న వరంధామయ్య - అవాక్కయిపోయాడు. ఆ మధ్యాహ్నం రామనాథశాస్త్రి ఇంట్లో భోం చేసారు. వరంధామయ్య తాహతు తెలుసుకొన్న రామనాధ శాస్త్రి పుస్తకాలు తిరగేసి రెండు సంబంధాలు చెప్పాడు. ఒకటి, పి.డబ్ల్యు.డి. - ఆఫీసులో టైపిస్టు, ఇరవై వేల రూపాయలు, మరొకటి మునిసిపాలిటీ ఆఫీసులో గుమాస్తా ఇరవై అయిదు వేల రూపాయలు.

"ఇవి దివ్యమైన సంబంధాలు. ఇంటికి వెళ్లి మాట్లాడుకొని ఉత్తరం వ్రాయి. నీ ఉత్తరం అందిన పది రోజుల్లో మంచిరోజు చూసుకొని వాళ్లు వచ్చే ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు రామనాథ శాస్త్రి పుస్తకం మూస్తూ.

వరంధామయ్య ఇష్టపడ్డట్లు తల ఊపాడు. ఆ సాయంత్రం బయలు దేరబోతూంటే అన్నాడు రామనాథ శాస్త్రి "వరంధామయ్యగారూ. మీకో కుమారుడున్నాడని చెప్పారు గదా. ఏం చేస్తున్నాడు."

"టెంపరరీ టైపిస్టుగా పని చేస్తున్నాడండీ"

"ఇంకేం। మీరూ .ఒక జెండా ఎగరేయండి"

"నాకిష్టం లేదు. శాస్త్రిగారూ"

"ఇష్టం లేకపోవడమేమిటండీ. దీని వల్ల భవిష్యత్తులో ఎంత ఉపయోగమో మీకిప్పుడు తెలియదు" అంటూ బలవంతంగా వరంధామయ్యను జెండా రిజిష్ట్రారు ఆఫీసుకు తీసుకు వెళ్లి అతని కుమారుని పేరు రిజిష్టరు చేయించాడు. సీరియల్ నంబరు ఇరవై అయిదు వేల తొమ్మిది వందలా ముప్పై ఒకటి అతనిది.

అంతే గాలిలోకి ఇంకో జెండా లేచింది. దాని మీద బి.జి-టెం.టై. 10 అని ఉంది.

వరంధామయ్య ఇంటికొచ్చి భార్యకు, పిల్లలకూ విషయమంతా చెప్పాడు. అతని భార్య సంతోషించింది. కాని రమ, ఉమ నిర్ఘాంత పోయారు జరిగిందంతా విని. జయరాం తన పేరు మీద జెండా ఎగరేసినందుకు విరుచుకు పడ్డాడు. మరు

నాడు రామనాథ శాస్త్రికి ఉత్తరం వ్రాసి జెండా తీసి వేయించగలనని తండ్రి చెప్పిన తరువాత గాని అతను శాంతించలేదు.

"ఈ రోజు మీరు వెళ్లింది సంబంధాలు చూడ్డానికి కాదు నాన్నా. ఫిష్ మార్కెట్‌కి. పెద్ద చేవల్ని వెతికి వాటికి ఆహారంగా మమ్మల్ని వేయడానికి. మీ దృష్టిలో మేము మనుషుల్లాగా కనిపించలేదా నాన్నా. అందరి లాగా మేమూ పుట్టామే. వాళ్లు పీల్చేగాలే మేమూ పీలుస్తున్నాము. వాళ్ళు తాగే నీరే మేమూ తాగుతున్నాము. తినే పదార్థాల్లో గాని, తినే విధానంలో గాని మార్పు లేదే. ఎందుకు మేము మగాళ్లకు ఎదురు డబ్బిచ్చి పెళ్లిళ్లు చేసుకోవాలి. ఆలోచిస్తే మేము మగాళ్ల కంటే ఎన్నో రెట్లు ఎక్కువే. మాకు మేము జన్మనిచ్చుకొంటూ మాతో బాటు మగవాళ్లకు కూడా జన్మనిస్తున్నామే. ఇది ఏ మగవాడూ చేయలేని పని. మేము సృష్టించిన మగవాడే మామీద పెత్తనం చేయడం మేం సహించం" దాదాపు అరచినంత పని చేసింది రమ.

"అమ్మా రమా! ఏమిటమ్మా నీ మాటలూ నువ్వూ..." కంగారుగా అంది ఆమె తల్లి.

"అమ్మా, మాట్లాడకు..." ఉమ కంఠం ఖంగుమంది. ఇంత కాలం వాళ్ల హృదయాలు అగ్ని పర్వతాల్లా కుతకుతా ఉడికి పోతున్నాయి. ఇప్పుడు జెండాలూరు చరిత్ర విన్న తరువాత వాళ్ల గుండెలు బద్దలై లావా ప్రవహిస్తూ ఉంది.

"ఆది కాలం నుంచి ఆడది మగవాడికి బానిసలా పడి ఉందమ్మా. రాముడు తన మాట కోసం సీత నుకారడవులకు పంపితే, ధర్మరాజు ద్రౌపదిని ఒక వస్తువుగా జూదంలో ఓడిపోయాడు. అంతేగాని ఆడదీ ఒక మనిషని, ఆవిడకీ కొన్ని ఆలోచనలు, అభిప్రాయాలూ ఉంటాయని వీళ్లెప్పుడైనా ఆలోచించారా. నేడు ఆడది మగవాడితో సమానంగా చదువుకొంటోంది. అన్ని రంగాల్లోనూ ముందంజ వేస్తోంది. ఆడవాళ్లు ప్రైమ్ మినిస్టర్లుగా ఉన్నారు. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, పైలెట్లు, సైంటిస్టులు, ఆర్టిస్టులు, డెంటిస్టులు, జర్నలిస్టులు, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు ఇలా అన్ని రంగాల్లో ఉన్నారు. పైపెచ్చు ఉద్యోగం చేస్తూ ఆడది అదనంగా ఇంటిలో వంటపని, పిల్లల ఆలనా పాలనా చూడాలి. ఇదొక జీతం లేని వెట్టి చాకిరీ. ఇన్ని చేస్తున్నా మగవాడు ఆడదాన్ని నీచంగా చూస్తున్నాడు. కట్నాలు తేలేదంటూ తను కట్టిన తాళినే ఉరితాడుగా మెడకు బిగిస్తున్నాడు. అందుకే మగవాళ్ల నియంతృత్వాన్ని అరికట్టడాకనికి ఒక మార్గమాలోచించాం."

విచిత్రంగా చూస్తున్నారు వరంధామయ్య, ఆయన సతీమణి జయమ్మ.

"అది మేము మా కాళ్ల మీద స్వతంత్రంగా నిలబడి జీవితాంతం బ్రహ్మచారిణులుగా ఉండిపోవడం. ఇవి మేము ఆకాశంలో ఎగురవేస్తున్న మొదటి జెండాలు. మాలాగే అందరు ఆడపిల్లలూ నిర్ణయించుకుంటే మగవాళ్ల మొనోపొలీ అంతమవుతుంది. అప్పుడు వాళ్లంతట వాళ్లే కాళ్ల బేరానికి వస్తారు" ఒకే కంఠంతో అరిచారు రమ, ఉమ.

వాళ్ల మనోపథంలో వందలు, వేలు, లక్షలు సంఖ్యలో ఆకాశంలో విచ్చలవిడిగా తిరిగే విహంగాల్లా ఎగురుతూ కనిపిస్తున్నాయి మహిళా విమోచన పతాకాలు. అంగుష్ఠ ప్రమాణంలో భూమ్మీద నిలబడి ఉన్న యువకులు వాటిని అందుకోవడం కోసం నానా యాతనలు పడడం కూడా వాళ్లకు కనిపించింది. □

## టైగర్ వీవింగ్

కార్పెట్ వీవింగ్‌కు ఉపయోగించే నీడిల్



కావాలి దీనికి. కాని ఆ నూది అన్ని చోట్లా దొరకదు. దొరికినా చాలా ఖరీదు. ఈ ఫోటో లోని పులిని నూది లేకుండా చేతితోనే **భావనా గోపాల్** వేసిందంటే, నేను ముందు నమ్మలేదు. కాని, నా ఎదురుగానే తను వేసి చూపించింది. అందుకే పాఠకులకు బాగా ఉపయోగమనే అభిప్రాయంతోనే ఇది రాస్తున్నా. మొదట్లో చిన్న పువ్వు లాంటిది ప్రయత్నించండి. క్రాస్ స్టిచ్ డిజైన్లు బాగుంటాయి.

దీనికి గళ్ళువుండే బట్ట కావాలి. కార్పెట్ వీవింగ్ బట్ట అంటే ఇస్తారు. కిటికీల లాగా, పోగులు వేసిన బట్టలాగా ఉంటుంద. పర్స్ చేసినా బాగుంటుంది ఈ కుట్టుతో నింపి.

లావుగా ఉన్న వూల్ అయితే బాగుంటుంది. ఒకటిన్నర లేక రెండు అంగుళాల వూల్ ముక్కలు కత్తిరించుకోవాలి. వూల్‌ను మధ్యకు మడచి బొమ్మలో చూపిన విధంగా క్రింద గడిలో నుండి అడుగు గుండా పై గడికి తీసుకోవాలి. క్రింది రెండు కొనలను తీసుకొని ఊల్ లూప్ లోనుండి బయటికి తీసి లాగితే ముడిగా వస్తుంది. ఇప్పుడు వూల్‌ను క్రిందికి తెచ్చి, క్రింది గడికన్నా కాస్త ఎక్కువగా ఉంచి, మిగతాది కత్తిరించాలి.


ఇలా డిజైను అంతా కావలసిన రంగు వూల్‌తో నింపి, నీట్‌గా లెవల్‌గా ఉల్‌ను కత్తిరించుకుని, ఆపైన చిన్న దువ్వెన తీసుకొని, జాగ్రత్తగా నెమ్మదిగా దువ్వాలి. వెల్వెట్‌లాగా మెత్తగా ఉంటుంది. చాలా శ్రమ పడి చేసిన ఈ పీస్‌కు ప్లాస్టిక్ పేపర్‌ను పైన కవర్‌గా ఉంచి, ఫ్రేమ్ చేస్తే బాగుంటుంది.

## మల్టీ పర్పస్ కవర్

దీనికి రెండు రంగులలో కావాలి బట్టముక్కలు ఒక ముక్క ఆరు అంగుళాల చదరం అయితే ఇంకొక రంగు ముక్క ఒకటి ముక్కాలు అంగుళం చదరం ఉండాలి. మనం దేనికి కవర్ కుడ్తామో దాని సైజును బట్టి ముక్కలు ఎన్ని కావాలో తీసుకోవాలి. ఫోన్ కయితే ఆరు అంగుళాల చదరపు ముక్కలు 16 అయితే చాలు. సోఫా కుషన్‌కు, టి.వి. కవర్‌కు ఇలా దేనికయినా కుట్టుకోవచ్చు. డైనింగ్ టేబుల్‌పైన మ్యాట్స్‌గా కూడా ఉపయోగించవచ్చు. సిల్కు, టెరికాట్ బట్టలు బాగుంటాయి. రెండు రంగులు కాంట్రాస్ట్ కలర్స్ అయితే బాగుంటుంది కాంబినేషన్.

ఆరు అంగుళాల బట్ట ముక్కను తీసుకొని, నాలుగు మూలలను మధ్యకు తెచ్చి, అదే రంగు దారంతో కలుపుతూ కుట్టాలి. ఈ కుట్టు అడుగు భాగం మీద పడకూడదు. ఈ భాగం రాంగ్ సైడన్న మాట. దీనిని ఇంకొక వైపు త్రిప్పి, తిరిగీ ఇదే విధంగా నాలుగు మూలలు కలుపుతూ కుట్టు వేయాలి. ఇలా అన్నీ కుట్టుకొని, రాంగ్ సైడ్‌లో ఒక దానికొకటి కలుపుతూ కుట్లు వేయాలి. ఇలా అన్నీ అతికించాక ఇంకొక కలర్‌లో బట్టను ఒకటి ముప్పావు అంగుళం చదరం తీసుకొని, ఫోటోలో చూపిన విధంగా ఉంచుకోవాలి రైట్ సైడులో. బొమ్మలో చూపిన విధంగా ఈ పై ముక్క పైన నాలుగు వైపులా గల క్రింది బట్ట కొనలను మడచి చిన్నగా నీట్‌గా హెమ్ చేయాలి ఆరు అంగుళాల ముక్క రంగులో దారం తీసుకొని.

అంతా అయ్యాక వెనక లైనింగ్ గుడ్డ వేసి, ఆపైన చుట్టూ పైపింగ్ చేయాలి. క్రొత్త వారికి ఇదెలా కుట్టామో ఓ పట్టాన అర్థంకాదు మనం, చెప్పేదాకా. నా దగ్గర చూసిన వాళ్ళంతా ఇట్టే నేర్చేసుకోవడమే గాక ఆర్యవైశ్య మహిళా మండలిలో



డెమాన్‌స్ట్రేట్ కూడా చేశాను. అందరికీ నచ్చేదేగాక చవకలో, తేలికగా, తొందరగా కూడా అవుతుంది ఇది. పిల్లల ఫ్రాకులకు, జాకెట్ వెనక భాగానికి, చుడీదార్ టాప్‌కు ముందు భాగానికి ఈ పీసెస్ అతికిస్తే వెరైటీగా ఉంటుంది. కాని వీటికి గాను ఆరు అంగుళాల చదరం బదులు నాలుగు అంగుళాల చదరం తీసుకుంటే, చిన్నగా, ముద్దుగా బాగుంటుంది.

మంగళా కందూర్